ఓంశ్రీసాయిరాం

ఇతడు మహారాష్ట్ర దేశమున జన్మించిన మహాత్ముడు. శ్రీమద్భాగవతమును ఏకనాథుడే రచించెను. ఆబాలవృద్ధులకు భక్తిప్రపత్తులు హృదయమున హత్తుకొనునట్లు భాగవతము బోధించినవారలలో ఏకనాథుడు ఆదర్శ ప్రధముడు. ఎట్టివారినైనను ద్వేషించక, శాంతివచనములతో సరిచేసుకొను సహనచిత్తుడు. ఒకనాడు ఏకనాథుడు నదీస్నానముచేసి వచ్చుచుండగ గిట్టని ఒక మహమ్మదీయుడు అతనిపై ఉమ్మి వైచెను. నానామాటలాడెను. అందులకు ఏకనాథుడు చిరునవ్వుతో అంగవస్త్రమును తీసి తుడుచుకొని అతనిని కూడను ఆశీర్వదించి గృహము చేరెను. హరిజన బాలుని పెంచి పెద్దచేసి తన బిడ్డవలె అతనికి అన్ని కార్యములు తానే చేసెను. తన ఇంటిలో చేరిన దొంగను క్షమించి, పాపము దొంగలకేమీ చిక్కలేదని విచారించి కొన్ని పాత్రలను దొంగలకిచ్చి పంపెను. నిన్ను హింసించు వారిని సహితము క్షమించి అతనికి ఉపకారము చేయమని బోధించిన త్యాగి ఈ ఏకనాథ్.

ఏకనాథ్ మహారాష్ట్ర దేశానికి చెందిన మహాభక్తుడు. అతడు ఒకసారి కాశీకి వెళ్ళాడు. అక్కడ విశ్వేశ్వరుని దర్శించి గంగాజలమును బిందెలతో నింపుకొని కావడిలో పెట్టుకొని తన శిష్యులతో బయలుదేరాడు. కాశీతీర్ధమును రామేశ్వరములో సముద్రములో కలుపుట ఒక ప్రాచీన సాంప్రదాయము.

ఏకనాథ్ తన శిష్యులతో ప్రయాణం చేస్తున్నాడు. మధ్యమార్గంలో ఒక గాడిద నోరు తెరచుకొని గిలగిల కొట్టుకుంటూ నేలమీద పడి వుండటం చూచాడు. అది ఎండాకాలం. దాహముతో ప్రాణం విడిచే స్థితిలో వుంది. వెంటనే ఏకనాధుడు కావడిలోనున్న బిందెడు నీరు దాని నోటిలో పోసి, దానిమీద కొంచెం జల్లాడు. కొంచెం సేపటికి ఆ గాడిద కన్నులు తెరచి మెల్లగా లేచి తోకాడిస్తూ వెళ్ళిపోయింది. అదంతా చూస్తున్న అతని శిష్యులు, 'స్వామీ! పవిత్రమైన గంగాజలమును రామేశ్వరమున రామలింగస్వామికి అర్పించవలసిన తీర్థమును ఈ గాడిద నోట్లో పోశారే!' అని ప్రశ్నించారు. ఏకనాథ్, 'నాయనలారా! 'ఈశ్వరస్సర్వభూతానాం' అన్న సత్యాన్ని మరచారా? సర్వజీవులందు సర్వేశ్వరుండు వుండునని తెలియదా! భగవంతునికి కాశీజలమేమిటి, రామేశ్వరజలమేమిటి? అంతా ఒక్కటే. మీ దృష్టికి అది గాడిదగా కనిపించింది. నాకు మాత్రం రామలింగస్వామే ఆ జీవిలో కనిపించాడు. దాహం తీర్చమని కోరాడు. నేను చేసినది అతి పవిత్రమైన కార్యము' అని వారికి తెలియజేశాడు.